క్లుప్తంగా

శశివర్ధన్‌కు సన్మానం



శశివర్ధన్‌ను సన్మానిస్తున్న మున్నూరుకాపు సంఘం నాయకులు

కొడంగల్ రూరల్: దుద్యాల మండల కేంద్రానికి చెందిన మాసుల శశివర్ధన్‌ను ఆదివారం పట్టణంలోని రెడ్డి బసిరెడ్డి ఫంక్షన్‌హాల్లో మున్నూరుకాపు సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఇటీవల హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడంతో హాస్టల్ వార్డెన్‌గా ఎంపికయ్యారు. దీంతో నియోజకవర్గంలోని మున్నూరుకాపు సంఘం నాయకులు మాసుల శశివర్ధన్‌ను అభినందిస్తూ శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో నర్సిరెడ్డి, బిచ్చప్ప, బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, శ్యాంసుందర్, హన్మంతు, రాజశేఖర్, తూము రాములు తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు అంబేడ్కర్ స్ఫూర్తి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పర్మయ్య తదితరులు

నవాబుపేట: భావితరాలకు అంబేడ్కర్ స్ఫూర్తి దాయకమని నారెగూడ మాజీ సర్పంచ్ పర్మయ్య పేర్కొన్నారు. మండల పరిధిలోని నారెగూడ గ్రామంలో ఆదివారం భీం దీక్ష కార్యక్రమంలో 9వరోజు అంబేడ్కర్ విగ్రహానికి నిత్య పూలమాల అలంకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ అంబేడ్కర్ ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. కొంత కాలం నుంచి నారెగూడలో భీందీక్ష నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హన్మయ్య, రాజు, క్రిష్ణ, బుచ్చయ్య, ఈశ్వర్, మహేందర్, హన్మంత్, రాజు, భీంరావ్, తదితరులు పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్



ఇఫ్తార్ విందు ఇస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు: మత సామరస్యానికి ప్రతీక ఇఫ్తార్ అని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం తాండూరు పట్టణంలోని క్లాసిక్ గార్డెన్‌లో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉపవాస దీక్ష ఆచరించిన ముస్లిం మతస్తులు సాయంత్రం 6.30 గంటలకు ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి తాండూరు సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, నాయకులు, ముస్లిం మతస్థులు తదితరులు హాజరయ్యారు.

ఎస్సీ కాలనీలో తాగునీటి బోరు ఏర్పాటు



బోరును బిగిస్తున్న గ్రామస్తులు

దుద్యాల్: మండల పరిధిలోని హస్నాబాద్ గ్రామంలో ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు తూర్పు భీములు సొంత ఖర్చులతో తాగునీటి బోరు బిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలంలో తాగునీటి సమస్య రాకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు నరేశ్, మైముద్, అశోక్, చెన్నప్ప, కృష్ణ, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

చల్లబడ్డ వాతావరణం



కుల్కచర్లలో కురుస్తున్న వర్షం

కుల్కచర్ల: భానుడి ప్రతాపంతో విలవిలలాడిన కుల్కచర్ల మండలం ఆదివారం మధ్యాహ్నం కురిసిన వర్షంతో చల్లబడింది. ఎండుముఖం పట్టిన వరి పొలాలకు కొంత ఊరట నిచ్చినా, మామిడి రైతులకు మాత్రం ఇబ్బందులు తప్పలేదు.

విద్యుత్ తీగలతో ఆటంకం

- వంతెనపై రోడ్డు నిర్మించలేని పరిస్థితి
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న గ్రామస్తులు
- తొలగించాలని కోరినా పట్టించుకోని అధికారులు
- స్పీకర్ కల్పించుకోవాలని ప్రజల, నాయకుల వినతి



దోర్నాల్ వంతెన రోడ్డుపై విద్యుత్ లైన్

ధారూరు: మండల పరిధిలోని స్టేషన్ ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై నిర్మించిన వంతెనకు విద్యుత్ తీగలు ఆటంకంగా మారాయి. ఈ పనుల కోసం మోక్షం లభించడంతో అన్ని స్లాబులు పూర్తి చేశారు. కానీ రెండు వైపుల రోడ్డు పనులు మాత్రం మిగిలిపోయాయి. ఈ వంతెనకు రోడ్డుకు అడ్డంగా విద్యుత్ తీగలు ఉండడంతో పనులు చేయలేకపోతున్నామని సదరు నిర్మాణదారులు చెబుతున్నారు. రోడ్డుకు అడ్డంగా విద్యుత్ తీగలు ఉండడంతో కూలీలు భయాందోళనకు గురవుతున్నారు. పనులు చేయడానికి ముందుకు రావడం లేదు. రోడ్డుపై మట్టి, కంకర వేయాలన్న, టిప్పర్లు అటూ..ఇటూ తిరగాలన్నా విద్యుత్ వైర్ల కింద నుంచే వెళ్లాల్సి ఉంటుంది. విద్యుత్ తీగలు తాకుతాయనే భయంతో రోడ్డు పనుల్లో ఆటంకం కలుగుతుందని ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. వీటిని తొలగించాలని ట్రాన్స్‌కో ఏఈ, సిబ్బందిని కోరినా ఫలితం శూన్యం. చివరకు రాష్ట్ర శాసనసభ స్పీకర్ కల్పించుకుని ట్రాన్స్‌కో ఏఈకి రెండుసార్లు ఫోన్లు చేసినా ఇదిగో వస్తున్నాం .. ఇదిగో చేస్తాం.. అంటూ కాలయాపన తప్పా పనులు ముందుకు సాగడం లేదని స్థానిక ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వంతెనకు ఇరువైపుల కొత్తగా రోడ్డు వేయాలన్నా ఈ తీగలే ఇబ్బందికరంగా మారాయని కాంట్రాక్టరే ఆందోళన చెందుతున్నారు. రెండు వైపుల రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ తీగలను వెంటనే సరిచేయాలని దోర్నాల్ గ్రామ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నారాయణరెడ్డి వాపోయారు. ఎనిమిది సంవత్సరాలుగా అసంపూర్తిగా నిలిచిన వంతెన పనులు శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ చొరవతో పూర్తి కావచ్చాయని చెబుతున్నారు. స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నానదిపై కొత్త వంతెన నిర్మాణానికి 2017లో రూ.4.70 కోట్లు మంజూరయ్యాయి. అప్పటి నుంచి ముగ్గురు కాంట్రాక్టర్లు మారినా పనులు మాత్రం అసంపూర్తిగానే మిగిలాయి. వంతెన పనులకు ఆటంకంగా మారిన విద్యుత్ తీగలను తొలగించి సత్వరమే పనులు చేపట్టాలని నారాయణరెడ్డి డిమాండ్ చేస్తున్నాడు.

తీగలు తొలగించాలి

వంతెనకు ఇరువైపుల రోడ్డు పనులకు రూ. 2.70 కోట్ల ప్రతిపాదనలతో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పూర్తి చేయించారు. రోడ్డు నిర్మాణ పనులకు కొత్తగా మరో రూ. 2.70 కోట్లు నిధులు మంజూరు చేయించారు. అన్ని ఉన్నా అల్లుని నోట్లో శని అన్న చందంగా ప్రస్తుతం చేస్తున్న పనులకు విద్యుత్ తీగలు అడ్డంకిగా మారింది. ఈ విషయంలో స్పీకర్ తగిన చొరవ తీసుకుని వంతెన వద్ద విద్యుత్ తీగలను సరిచేసే విధంగా ట్రాన్స్‌కో అధికారులకు ఆదేశాలు జారీ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యా రంగం అభివృద్ధి చెందాలి

ఆర్‌బీఓఎల్ ఫ్యాక్టరీ ఎండీ సరళ



ఉచిత ఎంసెట్ తరగతుల ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న సరళ

తాండూరు టౌన్: తాండూరు ప్రాంతం విద్యా రంగంలో అభివృద్ధి చెందాలని ఆర్‌బీఓఎల్ ఫ్యాక్టరీ ఎండీ సరళ శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం హిందూ ధార్మిక పరిషత్, సేవా భారతి ఆధ్వర్యంలో స్థానిక భాష్యం జూనియర్ కళాశాలలో బాలికలకు ఏర్పాటు చేసిన ఉచిత ఎంసెట్ శిక్షణా తరగతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యాపార రంగంలో అభివృద్ధిగాంచిన తాండూరు ప్రాంతానికి మినీ దుబాయి అనే పేరుందన్నారు. పలు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చే ఢిల్లీ తరహా, తాండూరు ప్రాంతం పేరు తెచ్చుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ, సింధు, భాష్యం కళాశాలల ప్రిన్సిపాల్‌లు నరేందర్, సంగీత, సోమ్‌నాథ్, హిందూ ధార్మిక పరిషత్ కన్వీనర్ గాజుల బస్వరాజ్, సభ్యులు వేణుగోపాల్ రెడ్డి, పటేల్ విజయ్, ఓం ప్రకాశ్ సోమాని, సేవా భారతి సభ్యులు హన్మప్ప, రమేష్, ప్రవీణ్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

కొడంగల్: పట్టణంలోని పద్మావతి సమేత శ్రీ మహాలక్ష్మీ వేంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. కలియుగ వైకుంఠ దైవం, భక్తుల ఇలవేల్పుగా నిలిచిన శ్రీవారి ఉత్సవాలను వేద పండితులు తిరుమల తరహాలో వైఖానస ఆగమ శాస్త్రోక్తంగా నిర్వహిస్తారు. నిత్యం వాహన సేవలు, కై ంకర్యాలు, పూజలు, సుప్రభాతం, తోమాల సేవ, అలంకరణ కనుల పండువగా కొనసాగనున్నాయి. తెలంగాణా ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, తిరుమల తిరుపతి దేవస్థానం తరపున శేష వస్త్రాలను సమర్పిస్తారు. 24వ తేదీ సోమవారం కోవిలాళ్వార్ల తిరుమంజనం, 25న సేనాధిపతి ఉత్సవం, అంకురార్పణ, 26న ధ్వజారోహణం, తిరుచ్చి ఉత్సవం, పెద్ద శేషవాహనం, 27న చిన్న శేషవాహనం, హంస వాహనం, 28న సింహవాహనం, వ్యాళి వాహనం, 29న కల్పవృక్ష వాహనం, సర్వభూపాల వాహనం, అమావాస్య పూలంగి సేవ, 30న మోహిని అవతార ఉత్సవం, ఉగాది ఆస్థానం, పంచాంగ శ్రవణం, గరుడోత్సవం, లంకా దహనం, తిరుమల తిరుపతి దేవస్థానం నుంచి శేష వస్త్రాలు సమర్పణ, 31న హనుమంత వాహనం, వసంతోత్సవం, గజవాహనం, ఏప్రిల్ 1న సూర్యప్రభ వాహనం, చంద్రప్రభ వాహనం, 2న రథోత్సవం, అశ్వవాహనం వీధి ఉత్సవం, 3న పల్లకీ ఉత్సవం, చక్రస్నానం, ధ్వజ అవరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయి.

వైభవంగా గీతా పారాయణం

హాజరైన శివానంద స్వామి



హోమం నిర్వహిస్తున్న శంకర్ యాదవ్ దంపతులు

తాండూరు టౌన్: శ్రీసాయిపుత్ర హోమ్స్ అండ్ డెవలపర్స్ అధినేత, ప్రముఖ రియల్టర్ బావనోళ్ల శంకర్ యాదవ్ నివాసంలో ఆదివారం శ్రీమద్భగవద్గీత అఖండ పారాయణం నిర్వహించారు. హిందూ ధార్మిక పరిషత్, గీతా సత్సంగ్ సేవా సమితి సభ్యుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆమనగల్లు శ్రీరామదూత ఆశ్రమ వ్యవస్థాపకుడు శ్రీశివానంద స్వామి హాజరయ్యారు. అఖండ గీతా పారాయణం సందర్భంగా శంకర్‌యాదవ్, చంద్రకళ దంపతులు హోమం, ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం భక్తులకు మహా ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమానికి నల్గొండ అడిషనల్ ఎస్పీ మధుసూదన రావు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కోట్రిక విజయలక్ష్మి, బీసీ సంఘం జాతీయ కార్యవర్గ సభ్యుడు రాజ్‌కుమార్, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సిములు, హిందూ ధార్మిక పరిషత్ సభ్యుడు బస్వరాజ్, వేణుగోపాల్ రెడ్డి, వినోద్, మనోహర్, ప్రేమ్, బంటు మల్లప్ప, మల్‌రెడ్డి, మల్లేష్, ఓంప్రకాశ్ సోమాని తదితరులు హాజరయ్యారు.

రైతు మహాసభలను జయప్రదం చేయండి

కొడంగల్ రూరల్: ఈ నెల 25, 26, 27వ తేదీలలో నిజామాబాద్‌లోని బీఎల్ఎస్ గార్డెన్ మాధవనగర్ ఏవూరి బ్రహ్మం హాల్లో నిర్వహించనున్న రైతు సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి గంటి సురేష్‌కుమార్ పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు సంఘం రాష్ట్ర మహాసభలకు దేశంలోని వివిధ రంగాలకు చెందిన మేధావులు, కళాకారులు, కమ్యూనిస్టు నాయకులు హాజరు కానున్నారని తెలిపారు. రైతులు సుభిక్షంగా ఉండేందుకు కార్యాచరణ రూపొందించనున్నట్లు, వారికి తగిన సూచనలు, సలహాలు అందించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున రైతులు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి



తాండూరు టౌన్ అంబేడ్కర్‌చౌక్‌లో..



అనంతగిరి: నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

తాండూరు టౌన్: స్వాతంత్ర్య పోరాటంలో చిరు ప్రాయంలోనే బ్రిటీష్ వాళ్లపై తిరుగుబాటు జెండా ఎగరేసిన షహీద్ భగత్ సింగ్ విగ్రహాన్ని తాండూరులో ఏర్పాటు చేయాలని పలు ప్రజా, కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం భగత్ సింగ్ వర్థంతిని పురస్కరించుకుని స్థానిక అంబేడ్కర్ చౌక్‌లో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె శ్రీనివాస్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు పి శ్రీనివాస్, సీపీఎం నాయకులు జైపాల్, వెంకటేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక సీతారాంపేట్‌లో చంద్రయ్య, రవి, నరేశ్, బలరాం, రాజు, నర్సింహులు, రఘుపతి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: స్వాతంత్రోద్యమంలో విప్లవ యువకిశోరాలు భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖ్‌దేవ్‌లు బ్రిటీష్ వారిని గడగడలాడించి దేశం కోసం ఉరికంభమెక్కారని సీపీఎం జిల్లా కార్యదర్శి మహిపాల్ అన్నారు. ఎన్‌టీఆర్ చౌరస్తాలో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గసభ్యుడు నవీన్‌కుమార్, మహి, లాలయ్య, శ్రీనివాస్, మాణిక్యం, శంకర్, రాజు, శివకుమార్, చందర్, రాజేందర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

వికారాబాద్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అక్బర్ మాట్లాడారు. తేజ, సిద్ధూ, రెహన్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలి

పరిగి: భగత్‌సింగ్ స్ఫూర్తితో పోరాడాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకటయ్య పేర్కొన్నారు. అనంతరం వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చంద్రయ్య, హబీబ్, సత్తయ్య, మహిపాల్, రఘురాం తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్ రూరల్: నేటి యువత భగత్‌సింగ్, రాజ్‌గురు సుఖదేవులను ఆదర్శంగా తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ బాధ్యుడు ఎండీ.మహమూద్ తెలిపారు. భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇందనూర్ బషీర్, మూతుల రాజు, మల్లప్ప, ఎండీ.ముస్తాఫా, లక్ష్మణ్, ఎండీ.ఖలీల్, శ్రావణ్, రాజు, భీములు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దోమ: స్వాతంత్ర్య పోరాటంలో ఆంగ్లేయులపై అలుపెరుగని పోరాటం చేసి, యువతకు స్ఫూర్తిగా నిలిచిన మహనీయుడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు నేటికీ ఆదర్శప్రాయులని నేతలు సత్యయ్య, మహిపాల్ రెడ్డి, రఘురాంలు పేర్కొన్నారు. వెంకటయ్య, మొగులయ్య, మనోజ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాల్: భగత్‌సింగ్ త్యాగం దేశానికి మార్గదర్శకమని సీపీఎం జిల్లా నాయకుడు బుస్స చంద్రయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మల్లప్ప, చెన్నయ్య, రాములు గౌడ్, శ్రీశైలం, అశోక్, మొగులయ్య, అనిల్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



పరిగిలో నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



కొడంగల్ రూరల్: భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి సీపీఐ నాయకుల నివాళి

యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక



నూతన కమిటీ సభ్యులు

దుద్యాల్: లగచర్ల గ్రామ అఖిల భారత యాదవ సంఘం నూతన కమిటీని జిల్లా అధ్యక్షుడు జింకల యాదయ్య యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రమేశ్ యాదవ్, ప్రధాన కార్యదర్శిగా వెంకట్‌రాములు యాదవ్, ఉపాధ్యక్షుడిగా మహేశ్, రాజు, కోశాధికారిగా శ్రీనివాస్, కార్యదర్శులుగా రమేశ్, శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడిగా కృష్ణ, సలహాదారుడిగా భాస్కర్, శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ యాదవులు అన్ని రంగాల్లో రాణించాలని, కుల అభివృద్ధి సమష్టి కృషి చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు పుర్ర రాఘవేందర్ యాదవ్, కొడంగల్ నియోజకవర్గ అధ్యక్షుడు మన్నె బస్వరాజ్, మండల అధ్యక్షుడు నర్సిములు యాదవ్ తదతరులు పాల్గొన్నారు.

శ్రీపాతాళ త్రికోణ మహా సుందరి విగ్రహ ప్రతిష్ఠ



పూజలో పాల్గొన్న ఆలయ ధర్మకర్త, గ్రామస్తులు

శంకర్‌పల్లి: మండలంలోని పర్వేద అనుబంధ గ్రామమైన కొత్తగూడలో శ్రీపాతాల త్రికోణ మహాసుందరి 20 అడుగుల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం జరిపించారు. ఆలయ ధర్మకర్త మాధవరెడ్డితో గ్రామస్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ధారూరు: ధారూరు బాలుర ఉన్నత పాఠశాలలో 1988–89 సంవత్సరంలో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కోట్‌పల్లి ప్రాజెక్టు వద్ద ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా కుటుంబ క్షేమ సమాచారం ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఆనందంగా గడిపారు. ప్రస్తుతం వారు ఏఏ రంగాల్లో స్థిరపడ్డారో అడిగి తెలుసుకున్నారు.



ప్రాజెక్టు వద్ద పూర్వ విద్యార్థులు

సంక్షిప్త వార్తలు

◆ ఎబ్బనూర్‌లో మల్లన్న జాతర



బోనాలతో మహిళలు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని ఎబ్బనూర్‌లో మల్లన్న జాతర ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగించి అనంతరం మల్లన్న గుడి వద్ద ఏర్పాటు చేసిన అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు రాజేందర్‌రెడ్డి, పెద్దలు, పాల్గొన్నారు.

◆ ఆర్థిక సహాయం అందజేత

దుద్యాల్: మండల పరిధిలోని నాజుఖాన్‌పల్లి గ్రామానికి చెందిన కిష్టపూరం భార్గవి కొన్ని రోజులుగా కిడ్నీ సంబధిత వ్యాధితో బాధపడుతూ ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఆమె భర్త కిష్టపూరం బాబు ఆస్పత్రి ఖర్చులకు ఆర్థిక సహాయం అందించాలని దాతలను వేడుకుంటూ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. అది చూసిన యువజన కాంగ్రెస్ జాతీయ కో–ఆర్డినేటర్ కృష్ణంరాజు రూ. 10వేల సాయం అందజేశాడు. ఈ కార్యక్రమంలో జూనియర్ కృష్ణం రాజు, వెంకటేశ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

◆ 27న ఉచిత కంటి వైద్య శిబిరం

కొడంగల్: ఈ నెల 27వ తేదీన ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వైద్యపరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. కంటి సమస్యలు ఉన్నవారు ఆధార్‌కార్డు వెంట తీసుకొని రావాలని సూచించారు. ఏమైన కంటి సమస్య ఉందని తేలితే వారికి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని కందూరు రాంరెడ్డి కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తారని తెలిపారు. కలెక్టర్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ, వైద్య ఆరోగ్య శాఖ, లయన్స్‌క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తారని ఆప్తాల్మిక్ అధికారి లయన్ హరినాథ్ తెలిపారు.

ఇందిరమ్మ ఇల్లు పూర్తయ్యేదెన్నడో!



గుంతలు తీసి వదిలేసిన ఇందిరమ్మ మోడల్ హౌస్

- గడువులోగా పూర్తికాని నిర్మాణం
- పట్టించుకోని అధికారులు

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి నెలదాటింది. ఇప్పటి వరకు కేవలం గుంతలు మాత్రమే తీశారు. ఈ భవన నిర్మాణాన్ని ఈ నెలాఖరు వరకు పూర్తి చేయాలని ప్రభుత్వం గడువు విధించినా పనులు మాత్రం ముందుకు సాగడంలేదు.

నత్తనడకన పనులు

పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మండల కేంద్రాల్లో ముందుగా మోడల్ ఇళ్ల నిర్మాణాలను చేపట్టాలని నిర్ణయించారు. మండల కేంద్రంలో మోడల్ ఇంటి నిర్మాణానికి నాయకులు, అధికారులు భూమి పూజ చేసి నెలకావస్తున్నా నేటికి గుంతల వరకే పనులు చేసి వదిలేశారు. మార్చి చివరి నాటికి నిర్మాణం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు ఉన్నప్పటికీ పట్టించుకునే అధికారులు కరువయ్యారు.

గడువుకు సమయం కావాలంటున్న కాంట్రాక్టర్

నమూన ఇంటి నిర్మాణానికి గడువు తక్కువగా ఉంది. ముందుగా స్థల సేకరణకు కొంత ఆలస్యమైంది. దీంతో గుత్తేదారులు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నాలుగు నెలల సమయం ఉంటే బాగుండేదని వారు చెబుతున్నారు. అలాగే ఇసుక కొరత, వివిధ కారణాలతో పనుల్లో మరింత జాప్యం చోటుచేసుకునే అవకాశం ఉంది.

సత్వరమే పూర్తి చేయిస్తాం

ఇందిరమ్మ మోడల్ ఇంటి నిర్మాణ పనుల్లో కొంత ఆలస్యమైన మాట వాస్తవమే. గుంతలు తీశారు. రెండు రోజుల్లో పనులను ప్రారంభిస్తాం. సత్వరమే పూర్తి చేయిస్తాం.

– చందర్‌నాయక్, డీఈ